ప్రజాశక్తి
గురువారం 22, డిసెంబర్ 2022
5
శ్రీ సత్యసాయి



జెసి ఇంట సిబిఐ సోదాలు

అనంతపురం : మాజీ పార్లమెంటు సభ్యులు జెసి.దివాకర్‌రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో సిబిఐ అధికారులు బుధవారం నాడు సోదాలు నిర్వహించారు. వారి అనునాయుడు జఠాధర సంస్థ ప్రతినిధి సి.గోపాల్‌రెడ్డి నివాసంలోనూ సోదాలు చేపట్టారు. బిఎస్–3 వాహనాలను బిఎస్–4 తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణను చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరు దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు సిబిఐ కూడా రంగంలోకి దిగింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం నాడు సిబిఐ తాడిపత్రి పట్టణంలో జెసి సోదరుల నివాసంలో తనిఖీలు చేపట్టారు. అయితే ఈ తనిఖీలకు వచ్చిన సమయంలో అటు జెసి సోదరులు గాని, ఇటు గోపాల్‌రెడ్డి గాని ఇక్కడ లేరు. జెసి.దివాకర్‌రెడ్డి ఇంట వివాహ వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో వారు ఇక్కడ లేరు. దీంతో కార్యాలయాల్లో పరిశీలించి వెళ్లిపోయారు.



మహా సభలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ముగిసిన మున్సిపల్ వర్కర్స్ మహాసభలు



తీర్మానాలకు అమోదం తెలుపుతున్న సభ్యులు

రాష్ట్ర అధ్యక్షులుగా నాగభూషణం రాష్ట్ర కమిటీకి నాగరాజు ఎన్నిక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 14వ రాష్ట్ర మహసభలు బుధవారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన మహాసభలో ఉత్తేజపూరిత వాతావరణంలో నడిచాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరుతో జరుగుతున్న నష్టాల గురించి చర్చించారు. అదే విధంగా మున్సిపల్ కార్మికులకు ఎన్నికలకు ముందు హామీలిచ్చి తరువాత విస్మరించిన తీరును ఎండగట్టారు. సమాన పనికి సమాన వేతనమిస్తామని చెప్పి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగు ఉదోగ్యులను రెగ్యులరైజ్ చేయకపోవడాన్ని ఎండగట్టారు. ఎప్కాస్ విధానం పేరుతో ఉద్యోగులుగా గుర్తించామని ప్రకటించి ఉద్యోగులకు వర్తించే రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ గాని, పెన్షన్ గాని లేకుండా చేయడాన్ని మహాసభ తప్పుబట్టింది. రెండు రోజుల పాటు ఆయా జిల్లాల వారీగానున్న ప్రత్యేక సమస్యలపైనా ఇందులో చర్చించారు. ఈ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు ఎంతో అవసరమని మొదటి రోజు జరిగిన చర్చల్లో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నరసింగరావు సూచించారు. రెండో రోజు జరిగిన చర్చల్లో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొని దిశానిర్దేశం చేశారు. సమస్యలపై అందరినీ కలుపుకుని పోరాటం చేయడమే కాకుండా సొంతబలాన్ని పెంచుకోవడంపైనా దృష్టి సారించాల్సిన అవసరముందని ధనలక్ష్మి రెండు రోజులపాటు జరిగిన మహాసభలో పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎనిమిది అంశాలపై రెండు రోజుల మహాసభల్లో తీర్మానాలు ప్రవేశపెట్టారు. వీటిని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. మొత్తంగా రెండు రోజులపాటు జరిగిన మహాసభలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి.

ఇద్దరికి రాష్ట్ర కమిటీలోచోటు

ఎపి మున్సిపల్ అవర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నూతన రాష్ట్ర కమిటీలో అనంతపురం జిల్లా నుంచి ఇద్దరికి చోటు లభించింది. రాష్ట్ర అధ్యక్షులుగా నాగభూషణం ఎన్నికయ్యారు. మున్సిపల్ వర్కర్సు అండ్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆయన ఉన్నారు. జిల్లా అధ్యక్షులుగానున్న నాగరాజు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

చితికిపోతున్న లారీ పరిశ్రమ..

'హిందూపురం పట్టణంలో నివాసముంటున్న సత్తార్ సాబ్ ఫైనాన్స్ చేసి దాదాపు ఐదు లారీలను ఏర్పాటు చేసుకుని 20 మంది కార్మికులకు ఉపాది నిచ్చారు. పెరిగిన ధరల వల్ల పూర్తిగా నష్టపోయాడు. ఉన్న లారీలను అమ్మి అప్పులు తీర్చాడు. మిగిలిన డబ్బుతో పరిగి బస్టాండ్ వద్ద కోడిగుడ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు'.

'బాబు అనే లారీ ఓనర్ ఉన్న లారీలను అమ్ముకుని మున్సిపల్ కార్యాలయం ముందు పాన్ షాపు పెట్టుకుని కుటుంబాన్ని పోషి స్తున్నాడు.. ఇదే విధంగానే చలపతి, నాగరాజు, సిద్దిక్ ఎంతో మంది లారీల యజమానులు నేడు పెరుగుతున్న డిజిల్ ధరలు, టోల్ ఛార్జీలతో బాడుగలు గిట్టుబాటు కాక ఉన్న లారీలను అమ్ముకున్నారు. చేసిన అప్పులను తీర్చి.. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు'.

ప్రజాశక్తి-హిందూపురం

దక్షిణ భారతదేశంలోనే హిందూపురం లారీ పరిశ్రమకు పెట్టింది పేరు. ఇక్కడి నుంచి నిత్యం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, చత్తీస్‌ఘడ్, కేరళ, ఒరిస్సా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు ఇక్కడ ఉత్పత్తి అయిన బర్జర్, బ్రిటిష్ పెయింట్స్, విప్రో, స్టీల్, ఫ్యాకింగ్ పేపర్ వివిధ రకాల సరుకులు ఎగుమతి అవుతుంటాయి. అక్కడి నుంచి వివిధ రకాల సరుకులు హిందూపురంతో పాటు పక్కన ఉన్న బెంగళూరుకు దిగుమతి అవుతుంటాయి. దీంతో ఎంతో మంది ఫైనాన్స్ తీసుకుని లారీలను ఏర్పాటు చేసుకున్నారు. వీరితో పాటు ఎంతో మందికి ఉపాధి కల్పించారు. అయితే కేంద్ర ప్రభుత్వ విధానాలు, కరోనా కాలంలో ఎదురైన నష్టాలతో అనంతపురం ఉమ్మడి జిల్లాలో లారీ పరిశ్రమ పూర్తిగా కుదేలయింది. డీజిల్, టోల్ గేటు, బాడుగల ధరలు పెరగక పోవడంతో లారీ రంగంలో పనిచేసే వారంతా వేర్వేరు రంగాలకు వలస వెళ్లిపోతున్నారు. ఎనిమిదేళ్ల కాలంలో డీజిల్ ధరలు పెరిగిన స్థాయిలో కిరాయిలకు బాడుగలు పెరగడం లేదు. పెట్టుబడి కోసం అప్పుచేసి తెచ్చిన డబ్బుకు వస్తున్న ఆదాయం వడ్డీ కట్టేందుకు కూడా గిట్టుబాటు కావడం లేదు. బ్యాంకులు, ప్రయివేటు ఫైనాన్స్‌లో తెచ్చిన అప్పులకు వడ్డీ పెరిగిపోతుండడంతో భయంతో యజమానులు లారీలను నష్టాలకు అమ్ముకుంటున్నారు. ఒకప్పుడు నాలుగైదు లారీలతో దర్జాగా బతికిన వారు సైతం వాటిని తెగనమ్ముతున్నారు. తెచ్చిన అప్పులు తీరక బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్స్‌లు వేసిన కేసులతో కోర్టుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరుగుతున్నారు. పెద్దఎత్తున లారీలను తెగనమ్ముకోవడంతో ఈ పరిశ్రమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఒకప్పుడు లారీలతో కళకళలాడిన హిందూపురం నేడు వెలవెలబోతున్నాయి. రాబోయే రోజుల్లో మరింత కుదేలయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

రోడ్డున పడిన ఓనర్లు, కార్మికులు ఆదుకోకపోతే పరిశ్రమ కనుమరుగు

డీజిల్ ధర పెరిగినా పెరగని బాడుగలు

2016లో డీజిల్ ధర రూ.52.28, బాడుగ టన్నుకు రూ.1300 ఉండేది. నేడు డీజిల్ రూ.99.58, బాడుగ రూ.1350 ఉంది. అంటే ఆరేళ్లలో డీజిల్ ధర రూ.47.30 పెరగగా బాడుగ ధర మాత్రం టన్నుకు రూ.50 రూపాయలు మాత్రమే పెరిగింది. తరచుగా పెరుగుతున్న డీజిల్ ధరలతో ఒక్కో లారీ యజమాని నెలకు వేలకు వేలు అదనంగా నష్టపోతున్నాడు. సాధారణంగా ఒక్కో లారీ నెలకు 3 వేల కిలోమీటర్లు తిరుగుతోంది. దీన్ని బట్టి చూస్తే పెరిగిన డీజిల్ ధరలకు పెరగని బాడుగల వల్ల నెలకు లారీపై రూ.50 వేల వరకు నష్టం వాటిల్లుతోంది.

ఈ మధ్యకాలంలో టోల్‌గేటు ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. గతంలో ఉన్న టోల్‌గేటు ధరలకు అదనంగా రూ.60 నుంచి రూ.200 వరకు పెరిగాయి. రోడ్లను బట్టి టోల్ ధరలు కూడా ఉంటున్నాయి. పెరిగిన టోల్ ధరలు లారీ యజమానులకు భారంగా మారాయి. ధరలు తగ్గించాలని ఆందోళనలు సైతం చేపట్టారు. ఏడాదికి టోల్‌ల సంఖ్యకూడా పెరిగింది. పదుల సంఖ్యలో పెరుగుతున్న టోల్ గేట్‌ల వల్ల నెలకు ఒక్కొక్క లారీకి రూ.10 నుంచి రూ.15 వేల వరకు భారం పడుతోంది. మరోవైపు టైర్ల ధరలు కూడా పెరుగుతున్నాయి. నెలరోజుల క్రితం రెండు టైర్లు రూ.42 వేలు ఉండగా ప్రస్తుతం రూ.48 వేలు దాటాయి. సాధారణంగా టైర్ల జీవిత కాలం 80 వేల కిలోమీటర్లు. కానీ రోడ్డు దెబ్బతినడం వల్ల ఎప్పుడు పగిలిపోతాయోననే భయం యజమానుల్లో ఏర్పడుతోంది.

గ్రీన్ ట్యాక్స్ పేరుతో మరో దోపిడీ..

గ్రీన్ ట్యాక్స్ పేరుతో ప్రభుత్వం లారీ యజమానులను నిలువుదోపిడీ చేస్తోంది. ఇప్పటికే పెరిగిన డీజిల్ ధరలు, పెరగని బాడుగలతో సతమతమవుతుంటే అదనంగా గ్రీన్ ట్యాక్స్‌ను వసూలు చేస్తుండటంతో యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలకు ఒకసారి 12, 14 టైర్ల లారీలకు రూ.12,500, 16 టైర్ల లారీలకు రూ.15000 చొప్పున చెల్లించాల్సి వస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 10 వేలకు పైగా లారీలు ఉండేవి. ఆహార ఉత్పత్తులతో పాటు ఇసుక, సిమెంట్, స్టీల్ తదితర సరుకులు అధిక శాతంగా ఉమ్మడి జిల్లా నుంచి ఎగుమతులు, దిగుమతులు జరిగేవి. ఈ రంగంలో యజమానులే డ్రైవర్లుగా ఉపాధి పొందే వారు అధిక సంఖ్యలో ఉన్నారు. కరోనా తగ్గుముఖం పట్టినా పెరిగిన డీజిల్ ధరలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గడచిన 12 నెలల్లో బ్యాంకులకు కంతులు చెల్లించలేక ఫైనాన్స్ కంపెనీలు వదిలేసిన యజమానులు పదుల సంఖ్యలో ఉన్నారు.

ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామిక వేత్తలకు రాయితీలు ఇచ్చి వారు బ్యాంకుల్లో చేసిన రూ.కోట్ల అప్పులను రద్దుచేసి మరీ ఆదుకుంటున్నారు. అయితే ప్రగతి చిహ్నాలుగా పేరొందిన లారీ పరిశ్రమను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాయి. పెరుగుతున్న డీజిల్ ధరలతో పాటు పెరుగుతున్న టోల్ గేట్‌లతో పాటు తర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, ప్రతి మూడు నెలలకు ఒక సారి ట్యాక్స్, ప్రతి ఏడాది ఎఫ్‌సి ఇతర ఖర్చుల వల్ల లారీలు నడుపాలంటే యజమానులకు ధైర్యం చాలడం లేదు. దీనిపై ప్రభుత్వాలు ఆలోచన చేసి లారీ పరిశ్రమను ఆదుకోక పోతే భవిష్యత్తులో పరిశ్రమ కనుమరుగు అవుతుంది.



బాడుగలు గిట్టుబాటు గాక హిందూపురంలో నిలిపివేసిన లారీలు



పంపిణీ చేసిన ట్యాబ్‌లతో విద్యార్థులు

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజుస్ ట్యాబ్‌లను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, ఎమ్మెల్యే దూద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. బుధవారం మండల పరిధిలోని పెడబల్లి ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ బసంత్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. అంతకుమునుపు బాపట్లలో జరుగుతున్న ముఖ్యమంత్రి ట్యాబ్‌ల పంపిణీ ప్రత్యక్ష కార్యక్రమాన్ని విద్యార్థులు తెరపై వీక్షించారు. డిఇఒ మీనాక్షి, అగ్రి అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ ఔటాల రమణారెడ్డి, జెడ్పిటిసి లక్ష్మీనరమ్మ, ఎంపిపి ఎవి రమణారెడ్డి, తహశీల్దార్ నవీన్‌కుమార్, సర్పంచి మంగ్లీబాయి, ఎంపిడిఒ అశోక్‌కుమార్ రెడ్డి. మండల కన్వీనర్ నరసారెడ్డి, డిసిసి సభ్యులు ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి దృష్టికి ప్రధానోపాధ్యాయుడు రామచంద్రరెడ్డి, ఉపాధ్యాయుడు చెన్నకృష్ణారెడ్డి తీసుకువెళ్లారు. పాఠశాలకు ప్రహరీ లేనందున రాత్రివేళల్లో అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ప్రహరీ నిర్మించాలని, పాఠశాలకు కేటాయించిన స్థలం ఆన్యాక్రాంతమవుతోందని దానిని పరిరక్షించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పాఠశాల చుట్టూ కొలతల వేసి ప్రహరీకి ఎంత డబ్బు అవసరమో తెలపాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షురాలు ఉషారాణి మండల సమాఖ్య అధ్యక్షురాలు కన్యాకుమారి, మండల ఉపాధ్యక్షులు కెసి.రంగన్న, హనుమంతరెడ్డి, వైసిపి నాయకులు బాలు, మురళి, మల్లికార్జున, తిరుపాల్ నాయక్, రవి నాయక్, కిరణ్ నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్త చెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన, వకృత్వపోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వ్యాసరచన పోటీల్లో కొడిగినహళ్లికి చెందిన లక్ష్మివసంత ప్రథమస్థానం, అదే పాఠశాలకు చెందిన నరసింహనాయుడు ద్వితియ, కొత్తచెరువుకు చెందిన రుచిత తృతియ స్థానంలో నిలిచారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

కొత్తచెరువు : పౌష్టిక ఆహారం తీసుకోవడంతోనే చిన్నారులు ఆరోగ్యకరంగా ఉంటారని నారాయణ పాఠశాల ఎజిఎం రమేష్ బాబు, ఆర్ఐ గురుప్రసాద్ తెలిపారు పోషక విలువలపై విద్యార్థులు తల్లిదండ్రులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రహీం, ప్రిన్సిపల్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘసంస్కర్త కందుకూరి

ప్రజాశక్తి-అనంతపురం

సమాజంలోనున్న రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కకర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని వక్తలు పేర్కొన్నారు. ఐద్వా, ఎస్ఎఫ్ఐ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ప్రజా నాట్యమండలి, కెవిపిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న సామాజిక బహుజన సాంస్కృతిక ఉత్సవాలు బుధవారం మూడవ రోజూ అలరించాయి. 'ఖడ్గధారి కందుకూరి' అన్న పేరుతో కందుకూరి విరేశలింగం పంతులు జీవితం ఆధారంగా ఈ నృత్యరూపకాన్ని అభ్యుదయ అకాడమీ కళాకారులు చక్కగా ప్రదర్శించి చూపించారు. మహిళల హక్కుల కోసం ఆయన ఏ రకంగా కృషి చేశారు.. అదే విధంగా విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషిని చాటి చెప్పారు. ఆనాటి సమాజంలోనున్న అనేక రుగ్మతలను పారదోలేందుకు ఆయన చేసిన కృషి, అందులో ఎదురైన ఆనేక ఇబ్బందులను ప్రదర్శనలో కళ్లకు కట్టినట్టు చూపించారు. వరుసగా మూడు రోజులు సాగుతున్న ఈ సాంస్కృతిక ఉత్సవాలకు విశేషమైన ఆధరణ లభిస్తోంది. పెద్దఎత్తున ప్రేక్షకులు విచ్చేసి ప్రదర్శనలు తిలకిస్తున్నారు. మాహనీయుల జీవిత చరిత్రను తెలియజేసే విధంగా ప్రదర్శన ఉండటమే కాకుండా ఆనాటి సామాజిక పరిస్థితులు, వారు ఏ రకంగా మూఢ విశ్వాసాలను పారదోలేందుకు ప్రయత్నించారన్నది తెలియజేసే విధంగా సాగుతున్నాయి. దీంతో ఇటువంటి కార్యక్రమాలు నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని అక్కడికి తిలకించేందుకు వచ్చిన ప్రేక్షకులు, పురప్రముఖులు చెబుతున్నారు.

అలరించిన సాంస్కృతిక ఉత్సవాలు

మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడతాయి

మానసిక వైద్యులు ఎండ్లూరి ప్రభాకర్

విద్యార్థుల మానసిక వికానికి ఇటువంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని మానసిక వైద్యులు ఎండ్లూరి ప్రభాకర్ పేర్కొన్నారు. మూడవ రోజు జరుగుతున్న సాంస్కృతిక ఉత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటి సామాజిక పరిస్థితుల్లో మహనీయులు ఏ రకంగా సమాజ మార్పుకు కృషి చేశారన్నది ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఇప్పటి తరం తెలుసుకునే వీలుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకులు సావిత్రి, రిటైర్డు డిప్యూటీ కలెక్టరు గోవింద రాజులు, మానవతా రక్తదాత సంస్థ ప్రతినిధి తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా రచయితల సంఘం నాయకులు షేక్ నబీరసూల్, మెడికల్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు మనోహర్, ఐద్వా నాయకులు రాజేశ్వరి, రామాంజినమ్మ, కెవిపిఎస్ నాయకులు నల్లప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు సూర్యచంద్ర, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ఉత్సవాల్లో మాట్లాడుతున్న మానసిక వైద్యులు ఎండ్లూరి ప్రభాకర్



నాటకంలో ఓ సన్నివేశం



సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైన విద్యార్థులు, ప్రజలు

వామపక్షాలతోనే రాజకీయ చైతన్యం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఇంతియాజ్

ప్రజాశక్తి-హిందూపురం

వామపక్షాలతోనే రాజకీయ చైతన్యం వస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాలులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. పశ్చిమ రాయలసీమ పట్టుభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డి ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభలో ప్రజా సమస్యలపై ఏ ఒక్కరు సైతం నోరు మెదపడం లేదన్నారు. కనీసం శాసన మండలిలో నైనా ప్రజల వాణిని వినపించడానికి ఎమ్మెల్సీ ఎన్నికలల్లో ఉద్యమ నాయకులకు ఆదరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిపిఐ నాయకులు బయన్న కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో దోపిడీని ప్రశ్నించాలన్న నిలదీయాలంటే ఉద్యమ నాయకులను చట్టసభలకు పంపాల్సిన అవసరం ఉందన్నారు. ఎప్పుడు లేని విధంగా ఈ సారి ఎన్నికల్లో దాదాపు 12వేలు బోగస్ ఓట్లు నమోదు చేయించారని విమర్శించారు. ప్రజాసమస్యలపై శాసనమండలిలో నోరు విప్పాలంటే వామపక్షాలతోనే సాధ్యమన్నారు. ఉద్యమ నాయకులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజుకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడానికి కలిసికట్టుగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వామపక్ష, విద్యార్థి సంఘ నాయకులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, సిద్దారెడ్డి, జెడ్పీ శ్రీనివాసులు, కాటమయ్య, బాబావలి, చంద్రశేఖర్‌రెడ్డి, చలపతి, రామాంజినేయులు, మారుతీ శ్రీనివాస్, రమణ, బాబా, వివిధ వామపక్ష ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు

కదిరి టౌన్ : వైసిపి హయాంలో విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యార్థులకు ట్యాబ్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యా విధానంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు థాంక్యూ జగన్ మామయ్య అంటూ ప్లేకార్డ్ లు ప్రదర్శించారు. అనంతరం ఎమ్మెల్యే అక్కడే గల మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, జెడ్పీటీసీ రాధాబాయి, ఎంఇఒ చెన్నకృష్ణ, కౌన్సిలర్లు, టెంపుల్ చైర్మన్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ కార్యక్రమాన్ని మడకశిర బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డిజిటల్ విద్యకు ప్రాధాన్యత పెరిగిన నేపథ్యంలో బైజుస్ సహకారంతో ఇన్ బిల్ట్ కంటెంట్ తో కూడిన ట్యాబులను అందించి విద్యార్థులను పోటీ ప్రపంచానికి సన్నద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాస్ భాస్కర్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పాఠశాలల కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

వికలాంగులను ప్రోత్సహించాలి

పుట్టపర్తి రూరల్ : వికలాంగులను అన్ని రంగాలలో రాణించే విధంగా ప్రభుత్వంతోపాటు సమాజం కూడా ప్రోత్సహించాలని కలెక్టర్ పి. బసంత్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పుట్టపర్తి మండల అభివృద్ధి కార్యాలయం ఆవరణంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కలెక్టర్‌తో పాటు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకులు అబ్దుల్ రసూల్, జిల్లా భూగర్భ జలఅధికారి రాజశేఖర్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. వికలాంగులు అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు రామాంజనేయులు. జలంధర్. రాఘవేంద్ర, ఈశ్వరయ్య, నందప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనే

మడకశిర: మడకశిర ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను, కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే జేఏసీ ఆధ్వర్యంలో నిరవధిక ఆందోళన చేపడతామని ఎన్ఎంయు నాయకులు హెచ్చరించారు. ఎన్ఎంయు నాయకులు రామకృష్ణ ఆధ్వర్యంలో మడకశిర డిపో మేనేజర్ ప్రవీణ్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మడకశిర డిపో ప్రారంభం నుండి ఉన్న సర్వీసులను యథావిధిగా కొనసాగించాలని కోరారు. అధికారుల అనాలోచితం మూలాన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పాటు డిపోకు ఆదాయం తగ్గుతోందని విమర్శించారు. ఏకపక్ష నిర్ణయాలతో సర్వీసులను ఇష్టారాజ్యంగా మార్చి ఆదాయానికి గండి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే జేఏసీ ఆధ్వర్యంలో మడకశిర డిపో ఆవరణంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

'పల్లె' పై విమర్శలు మానుకోవాలి : టిడిపి

బుక్కపట్నం : పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పల్లె రఘునాథ్ రెడ్డి పై చేస్తున్న ఆరోపణలను మానుకోవాలని టిడిపి మండల కన్వీనర్ మల్ రెడ్డి, నాయకులు మీసాల మురళి, సయ్యద్ బాషా, శ్రీరాములు హితవు పలికారు. బుధవారం మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. టిడిపి నాయకుడు సుబ్రహ్మణ్యం పల్లెపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని అన్నారు. పల్లెను విమర్శించే ముందు గతాన్ని గుర్తుకు చేసుకోవాలని సూచించారు. టిడిపి నాయకులు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతుండగా అక్కడ చేరుకున్న పేదరాసు సుబ్రహ్మణ్యం వచ్చారు. తాను పల్లెకు వ్యతిరేకమని పార్టీ అధిష్టానానికి, పార్టీకి వ్యతిరేకం కాదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవ నాయుడు, సామకోటి ఈశ్వరయ్య, శ్రీరాములు, జయరాం, కేశప్ప తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ హాకీ పోటీలకు ధర్మవరం విద్యార్థిని

ధర్మవరం టౌన్ : సౌతోజోన్ హాకీ పోటీలకు స్థానిక డెహెచ్ ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థిని శ్రావణి ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుతున్న శ్రావణి ఈనెల 2, 3 తేదీలలో ఎస్కే యూనివర్సిటీ నిర్వహించిన సెలక్షన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచి ఎస్కేయూ జట్టుకు ఎంపికైందని ప్రిన్సిపల్ చెప్పారు. తమిళనాడులోని డాక్టర్‌అంబేద్కర్ లా యూనివర్సిటీలో ఈనెల 26 తేదీ నుండి ప్రారంభమయ్యే సౌత్‌జోన్ హాకీ పోటీల్లో ఎస్కేయూనివర్సిటి జట్టు తరపున శ్రావణి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. దీంతో బుధవారం కళాశాలలో ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపవన్ కుమార్, పీడీ ఆనంద్, అధ్యాపకులు చిట్టేమ్మ. సమీవుల్లా, కిరణకుమార్ గోపాల్‌నాయక్, పావని, భువనేశ్వరి తదితరులు శ్రావణిని అభినంధించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ బసంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణంలో సామాజిక అటవీ విభాగం ఆధ్వర్యంలో జగనన్న పచ్చ తోరణం కార్యక్రమం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం మోడల్ స్కూల్ ఆవరణంలో ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ అందరి సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి మనమందరం మొక్కలు నాటాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు అంతకుమునుపు విద్యార్థులచే జగనన్న పచ్చ తోరణం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సామాజిక వన విభాగం డివిజన్ అటవీశాఖ అధికారి పి శ్యామల, డివిజనల్ అటవీశాఖ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, డిడబ్ల్యుఎంఎ పీడీ రామాంజనేయులు, ఉద్యానవన శాఖ అధికారి చంద్ర శేఖర్, కళాశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు, జెడ్పీటీసీ లక్ష్మీ నరసమ్మ, సర్పంచి వెంకటసుబ్బుడు, ఎంపీటీసీ మధురిమ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న అధికారులు

కరాటేలో యశోద పాఠశాల విద్యార్థిని సత్తా

ధర్మవరం టౌన్ : కరాటేలో యశోద పాఠశాల విద్యార్థిని సత్తాచాటినట్టు ఆ పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. ఈనెల 17,18వతేదీలలో తిరుపతి యస్వీ. కాంప్లెక్స్‌లో జరిగిన అండర్-14 కరాటే విభాగంలో యశోదపాఠశాలలో 9వతరగతి చదువుతున్న సాయి అఖిల పాల్గొని సత్తాచాటినట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థినినిడైరెక్టర్ తోపాటు ప్రిన్సిపల్ అనూపుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్యామ్, అశోక్ తదితరులు అభినందించారు.



సాయిఅఖిలను అభినందిస్తున్న ప్రిన్సిపల్

జగన్ పాలనలో ప్రజలకు రక్షణ కరువు

కదిరి టౌన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలకు రక్షణ కరువైందని టిడిపి నాయకులు, పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని కందికుంట వెంకటప్రసాద్ స్వగృహంలో తెలుగుదేశ పార్టీ మైనార్టీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కదిరి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, ఖాదర్ బాషా, కదిరి నియోజవర్గ మైనార్టీ అధ్యక్షులు బావవలి మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ముస్లింలకు రక్షణ కరువైందన్నారు. ముస్లింల పక్షపాతి అని చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి వారికి తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. మైనార్టీల ప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తున్న వైసిపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సులేమాన్ మునవర్ అలీ ఖాన్, హైదర్, షానవాజ్, బషీర్, తెలుగు యువత నాయకులు రోషన్, సిరాజ్, చాంద్‌బాషా, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు


ప్రజలకు అందుబాటులో ఉండండి

ప్రజాశక్తి - మడకశిర రూరల్

సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. మండలంలోని హరేసముద్రం గ్రామ సచివాలయాన్ని పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనువైన చోట వారపు సంత ఏర్పాటు చేయాలి

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలో కర్ణాటక నాకేపల్లి రహదారిలో ప్రతి శనివారం నిర్వహించే వారపు సంతను అనువైన చోట ఏర్పాటు చేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డికి బుధవారం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతను రోడ్డుకు ఇరువైపులా నిర్వహిస్తుడటంతో వ్యాపారులకు, వినియోగదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కదిరి, బుక్కపట్నంకు వెళ్లే బస్సులు, వాహనాలు వెళుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజల సౌకర్యం ఈ వారపు సంతను మరొక ప్రదేశంలో ఏర్పాటు చేయాలని కమిషనర్ ను కోరారు. ఈ సమావేశంలో పార్లమెంటు రైతు సంఘం ప్రతినిధి అమ్మినేని కేశవ నాయుడు, ఆరవ వార్డు ఇన్‌ఛార్జి బేకరీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



అధికారితో మాట్లాడుతున్న నాయకులు

వివక్షకు దూరంగా ఉందాం

బత్తలపల్లి : ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న వారిని సమాజంలో ఏ ఒక్కరిని కూడా వివక్షతకు గురి చేయరాదని.పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి ఆదేశాల మేరకు లోకల్ డోనార్స్ వారి సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ వారు రోగులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వైద్యాధికారిణి తేజశ్రీ, ఆనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్ ప్రసిడెంట్ వీరాంజనేయులు. పీఎఫ్ఎ సేతు ఈవి రమణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందులతో పాటు మంచి పుష్టికరమైన ఆహారం తీసుకోవడం ద్వారా జీవన ప్రమాణాలను పెంచుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రాజశేఖర్ పర్యవేక్షకులు చంద్రశేఖర్‌రెడ్డి, నారమ్మ జోనల్ సర్జన్ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-హిందూపురం

కార్మికుల సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యలయంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్మికులకు హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మాజీ నియోజకవర్గ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

పెనుకొండ : పెనుకొండ మండలం పెద్ద చెరువు కట్ట ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందాదు. ఆగి ఉన్న లారీని వెనక నుండి ఇనోవా కారు ఢీ కొనడంతో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. ఈ ప్రమాదానికి సంబందించి స్థానికులు తెలిపిన వివరాలు... పరిగి మండలం శ్రీరంగరాజుపల్లికి చెందిన ఓ కుటుంబంతో పాటు వారి బంధువులు కలిసి ఒక సుమో, మరో ఇన్నోవాకారులో యల్లనూరు మండలం కొడివాండ్లపల్లికి శుభకార్యం నిమిత్తం బయలు దేరారు. మార్గమధ్యంలో ఇన్నోవా కారు ఆగిఉన్న సిమెంట్‌లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీరంగరాజుపల్లికి చెందిన సత్యనారాయణ(50) అతని మామ గౌరీబిదనూరుకు చెందిన నంజుడప్ప(70) అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ఉన్న నాగరత్నమ్మ, శ్రీరాములు, లక్ష్మమ్మ, సౌభాగ్య, అరుణ్, అశ్వర్థప్పకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డవారిని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పెనుకొండ ఎస్ఐ రమేష్ బాబు సంఘటన స్థలాన్ని సందర్శించారు. మాజీ ఎమ్మెల్యే బి.కె. పార్థసారధి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ తదితరులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.



రోడ్డు ప్రమాద దృశ్యం

ప్రయివేటు బస్సు బోల్తా

మడకశిర : అగలి నుండి హిందూపురం వెళుతున్న ప్రైవేటు బస్సు బోల్తా బడటంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు, విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అందుకు సంబందించిన వివరాలు... బుధవారం ఉదయం అగలి నుండి హిందూపురానికి ప్రయివేటు బస్సు విద్యార్థులు, ప్రయాణికులతో అధికలోడుతో మడకశిరకు వస్తోంది. నీలకంఠాపురం వద్ద కు రాగానే రోడ్డు మలుపులో బస్సు స్టీరింగ్ కట్ కావటంతో అదుపుతప్పిన బస్సు బోల్తాపడింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు ప్రయాణికులు గట్టిగా కేకలు వేశారు. సమీపాన ఉన్న గ్రామస్తులు, తదితరులు సంఘటనాస్థలానికి చేరుకుని చ్చెనలు వేసి కిటికీలో నుండి విద్యార్థులు, ప్రయాణికులను ఒక్కొక్కరిని బయటకి తీశారు. అందులో చాలా మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికంగా ఉన్న నీలకంఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి, మరి కొంతమందిని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. బస్సు డ్రైవర్ వేగంగా రావడంతో ప్రమాదం జరిగిందని విద్యార్థులు, ప్రయాణికులు తెలిపారు. బస్సు లో దాదాపు 60 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి గాయపడ్డవారికి వైద్యసేవలందించారు. సిఐ సురేష్ బాబు, ఎస్ఐ నాగేంద్ర, పోలీసులు ఘటనాస్థలాన్ని సందర్శించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'గురుకులం'లో ఘర్షణ

రొద్దం : స్థానిక మహాత్మ జ్యోతిరావు బాపులే పాఠశాలలో సిబ్బంది మధ్య బుధవారం సాయంత్రం ఘర్షణ చోటు చేసుకుంది. ఉపాధ్యాయుడు, వాచ్‌మెన్ మధ్య గొడవ జరిగింది. తన ద్విచక్రవాహనంలోని పెట్రోల్‌ను వాచ్‌మెన్ నరసింహులు దొంగలిస్తున్నాడన్న ఆనుమానం ఉపాధ్యాయుడికి కలిగింది. ఈ నేపథ్యంలో టీచర్‌కు వాచ్‌మెన్‌కు మధ్య బుధవారం సాయంత్రం గొడవ జరిగింది. విద్యార్థులు, గ్రామస్తుల ఎదుటే ఒకరినొకరు బూతులు తిట్టుకున్నారు. విద్యార్థులకు విద్యాబుద్దులు చేప్పే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు, వాచ్‌మెన్ ఇలా వీధి రౌడీల మాదిరి గొడవ పడటంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదే కాకుండా పాఠశాలలో అనేక చోరీలు జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు : ఎస్పీ

పుట్టపర్తి రూరల్: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన విడియో కాన్ఫరెన్సు ద్వారా నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడకుండా చర్యలు తీసుకోవాలని ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా లో ఎక్కడ ఎటువంటి అసంఘటిత చర్యలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిటీషనర్స్ పట్ల మర్యాదగా వ్యవహరించి త్వరితగతిన వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. ఈసమావేశంలో అదనపు ఎస్పీ రామకృష్ణ రపసాద్, డిసిసిబి సిఐ సుబ్బారావు, వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లాలోని పలువురు డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

రొద్దం : మండలంలోని మోపార్లపల్లిలో బుధవారం జరిగిన ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన చక్కీర్‌రెడ్డికి చెందిన 8బండ్ల మొక్కజొన్న గడ్డివామికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. దీంతో తనకు దాదాపు 15వేలు రూపాయిలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. తనను ఆదుకోవాలని ఆయన కోరాడు.

ప్రజాపక్షపాతి జగన్ : వైసిపి

జిల్లా వ్యాప్తంగా ఘనంగా ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకలు



చీరలు పంపిణీ చేస్తున్న బత్తల హరిప్రసాద్, తదితరులు

కదిరి టౌన్ : ప్రజాపక్షపాతి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని వైసిపి రాష్ట్ర సంయుక్త డాక్టర్ బత్తల హరిప్రసాద్, సిఇసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జన్మదిన పురస్కరించుకొని బుధవారం కదిరి రూరల్ కుమ్మరవాండ్లపల్లి డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా వెయ్యి మంది మహిళలకు చీరల పంపిణీ చేశారు. 50 కేజీల కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బత్తల హరిప్రసాద్ మాట్లాడుతూ చిన్న వయసులోనే ప్రజానేతగా ఎదిగిన ఏకైక వ్యక్తి జగన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సెల్ లింగాల లోకేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ, ఎంపీటీసీ ఆదినారాయణ, పట్టణ అధ్యక్షుడు బాహుద్దీన్, సంపంగి గోవర్ధన్, షామీర్, ముబారక్, కిరణ్ కుమార్, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నంబులపూల కుంట : మండల పరిధిలోని ధనియాని చెరువు సచివాలయం నందు నాయకులు, అటవీ అధికారులు, సచివాలయం సిబ్బంది మొక్కలు నాటారు. ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దిల్షాద్, ఎంపీటీసీ రంగారెడ్డి, ఫారెస్ట్ అధికారులు షామీర్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : మండల పరిధిలోని నల్ల సింగయ్య గారి పల్లిలో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి స్వగృహంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. దుద్దుకుంట ఫౌండేషన్ చైర్మన్ అపర్ణరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, జిల్లా వైద్యాధికారి ఎస్‌వి. కృష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ తిపేంద్ర నాయక్, దుద్దుకుంట వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ పరిధిలోనే వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తచెరువు : కొత్తచెరువు లోనే వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 50వ జన్మదిన వేడుకలను వైసిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భర్త రెడ్డప్ప రెడ్డి, సర్పంచి భర్త నాగరాజు, వైసిపి నాయకులు వాల్మీకి శంకర్, నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : వైఎస్. జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహం దగ్గర ఘనంగా నిర్వశించారు. ఈ కార్యక్రమములో స్థానిక సర్పంచు రూప, ఎపిపి చంద్రశేఖర్, స్వచ్ఛ ఆంధ్ర స్టేట్ డైరెక్టర్ బి.నారాయణ రెడ్డి, నాయకులు రాజారెడ్డి, మారుతిరెడ్డి, కలిపి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చిన్నకోడిపల్లిలో వైసీపీ నాయకుల మధ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అమరాపురం :. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా యువకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈరన్న, స్వారక్క నరసింహామూర్తి, వీరకేతప్ప, త్రిలోక నాథ్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డి జన్మదినవేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జగన్ మోహన్, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, గంగోజమ్మ, సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

నల్లచెరువు: యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలకు స్థానికఎమ్మెల్యే సిద్ధారెడ్డి హాజరయ్యారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలోని వైఎస్ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల కేంద్రలో మూడు రోజుల పాటు నిర్వహించిన సిఎం కప్ పోటీలలో గెలుపొందిన జట్టుకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్ రెడ్డి, యూసుఫ్, జయచంద్రారెడ్డి, భాస్కర్ రెడి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ప్రాణ ప్రాణపాయస్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం గొప్ప విషయమనిఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారకు. కదిరి టౌన్ స్థానిక వైమారెడ్డి కూడలి నందు మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆలయ చైర్మన్ గోపాలకష్ణ ఆధ్వర్యంలో ప్రజా మెడికల్ స్టోర్ వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అడపాల వీధి ఫైర్ స్టేషన్ వద్ద ఉన్న గురుకుల పాఠశాల నందు ఎస్ టి సెల్ కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థుల మధ్య ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు రాజశేఖర్ రెడ్డి, గంగాదేవి శంకర్, ఎస్ఎండి ఇస్మాయిల్, వేముల ఫయాజ్, రాధాబాయి, కౌన్సిలర్లు మురళి, ప్రణీత్ రెడ్డి, రంగారెడ్డి, ఇస్మాయిల్, మహమ్మద్, ఆవుల స్వామి, కిన్నెర కళ్యాణ్, ఖాసీం, నౌషాద్, షాను, క్రిష్టప్ప, ఇలాహి తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : తలుపుల మండల కేంద్రంలో వైఎస్ఆర్ విగ్రహం ఎదుట ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్ , సీనియర్ నాయకులు పురుషోత్తం రెడ్డి , మాజీ సర్పంచి డిపి ఫయాజ్ అహ్మద్, కులశేఖర్ రెడ్డి, దేవేంద్ర నాయక్, పెద్ది నాయుడు, మల్లికార్జున, శ్రీరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వృద్ధులకు దుప్పట్లు అన్నదాన కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు నిర్వహించారు. ఆమిదాల గొంది గ్రామంలో ఉన్న వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లను న్యాయవాది గోపి పంపిణీ చేయగా, రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవి శేఖర్ రెడ్డి, కవితా రంగే గౌడు, చీపులేటి వెంకట రంగారెడ్డి, కల్లు మరి శ్రీరాములు , సర్పంచ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : ముఖ్య మంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి 50 వ జన్మదిన వేడుకలలో బాగంగా చిలమత్తూరు మండలంలో జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులు పూర్తి చేసిన ఇళ్లకు ఫ్యాన్లను వైసిపి యువజన నాయకులు కోటమీద సురేష్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్సీ ఇక్బాల్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ ఇంద్రజ, స్థానిక నాయకులు జగన్ మోహన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుక బుధవారం మండలంలోని కొండకమర్లలో సింగల్ విండో అధ్యక్షులు ఎద్దుల రామసుబ్బారెడ్డి, కోఆప్షన్ సభ్యులు పొగాకు నిషార్ అహ్మద్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఎస్సీ సెల్ నాయకుడు లక్ష్మీపతి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసుల రెడ్డి, ఓడిసి టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్టారెడ్డి, సర్పంచు శ్రావణి, కదిరి ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : రాష్ట్రంలోని బీసీలకు అగ్రపీఠం వేసిన తొలి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే పేరు దక్కుతుందని ఏపీ కురుబ కార్పోరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి జన్మదిన వేడుకలను బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి గజ్జెల వెంగళరెడ్డి, సర్పంచులు జిల్లా కరుణాకర్ నాయుడు, అక్కల డామోదర్, ఉప సర్పంచు కోళ్ల మొగ్రం చెన్నక్రిష్ణారెడ్డి, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

ముదిగుబ్బ : ముదిగుబ్బ మండల కేంద్రంలోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, ఇందుకూరు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

తాడిమర్రి: డిసిఎంఎస్ ఛైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బ్రెడ్లు, పండ్లు అందజేశారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పెనుకొండ : పట్టణంలో జగన్మోహన్ రెడ్డి జన్మదినం వేడుకలను ఎమ్మెల్యే శంకర్ నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫరూక్, వైస్ చైర్మన్ సునీల్, వైసిపి నాయకులు జయశంకర్ రెడ్డి, రామచంద్ర, నరసింహ, నాగలూరు బాబు తదితరులు పాల్గొన్నారు. పెనుకొండ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ రెడ్డి సంఘం నాయకులు సుధాకర్ రెడ్డి, సుగుణాకర్ రెడ్డి, మహేశ్వర రెడ్డి, మారుతీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణ కన్వీనర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, నెట్ క్యాబ్ డైరెక్టర్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు సాయికిత సూర్య గౌడ్, శ్రీ లక్ష్మీ నారాయణ రెడ్డి, చెరువు భాస్కర్ రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం పట్టణంలో వాడ వాడల ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ ఇక్బాల్, నియోజక వర్గ పరిశీలకులు రెడ్డిశ్వర్ రెడ్డితో కలిసి వైస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పట్టణ పరిధిలోని జెవిఎస్ ఫంక్షన్ హాల్ లో గుడ్డంపల్లి దీపిక వేణు రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు నిర్వహించి సామూహిక సీమంతాల కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి పాల్గొన్నారు. మెప్మా విభాగంలో ఆధ్వర్యంలో ఎంజిఎం మైదానంలో కేక్ కట్ చేశారు. ఇందిరమ్మ సర్కిల్‌లో రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొంత మంది వికలాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఎంజిఎం పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. వైసిపి నాయకులరాలు మధుమతి రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం 13వేల మంది విద్యార్థులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ చలివెందల ఉపేంద్ర రెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సామూహిక సీమంతంలో చీరలు అందజేస్తున్న ఎమ్మెల్సీ, తదితరులు